క్లుప్తంగా

8న ఆలయ భూముల వేలం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయం పంట చేను పొలాలు ఒక్క సంవత్సరం లీజు కోసం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 8న శనివారం 2023 -24 సంవత్సరానికి ఆలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహిస్తామని, వేలంలో పాల్గొనే రైతులు డిపాజిట్ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలో విద్యార్థిని ప్రతిభ

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో పట్టణానికి చెందిన దుర్గం తులసీరామ్ -హారిక దంపతుల కుమార్తె దుర్గ శశివెన్నెల 300 మార్కులకు 231 మార్కులు సాధించి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కేటగిరిలో రెండో ర్యాంకు సాధించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన నివాసంలో విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ సైనిక్ స్కూల్‌లో శశి వెన్నెలకు సీటు లభించినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన ర్యాలీ

కాగజ్‌నగర్‌టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు వైద్యశాఖ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామకృష్ణ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు


గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల ఫాదర్లు గుడ్ ఫ్రైడే ప్రత్యేకతను భక్తులకు వివరించారు.

యువతకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ


కిట్లు అందజేస్తున్న సర్పంచ్ భీమేష్

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని ఈదులవాడ సర్పంచ్ భీమేష్ గ్రామంలోని యువతకు వాలీబాల్ క్రికెట్ కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో క్రీడల అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

వైద్యులు లేని ఆసుపత్రి

- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, రోగులు
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వైనం


సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ప్రసూతి వార్డు ఉన్నా నిరుపయోగంగా మారింది. నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు మండల కేంద్రంలో కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నిర్మించారు. గర్భిణులకు ప్రయోజనం చేకూరేలా ప్రసూతి వార్డు సైతం ఏర్పాటు చేశారు.

వేధిస్తోన్న వైద్యుల కొరత

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరతతో పూర్తిస్థాయిలో వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దిక్కుతోచని స్థితిలో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులను రోగులు ఆశ్రయించాల్సి వస్తోంది. వైద్యులు లేక చికిత్స కోసం వచ్చిన రోగులను పరిశీలించి ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. ప్రసూతి వార్డులో అన్ని వసతులున్నా గైనకాలజిస్టు లేక నిరుపయోగంగా మారింది. గర్భిణులకు సకాలంలో వైద్యం అందకపోవడంతో ప్రసూతి కోసం వచ్చే గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యనిపుణులు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు వైద్యులు మాత్రమే డ్యూటీ డాక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి రోగులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు చొరవ చూపాలి



నియోజకవర్గంలోని ఐదు మండలాలకు పెద్ద దిక్కు ఈ ఆసుపత్రి. ప్రతీరోజు ఆయా మండలాల ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక, ప్రైవేటు ఆసుపత్రుల్లోకి వెళ్లలేక నిరుపేదలు వెళ్లలేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

\- దేవిదాసు, సిర్పూర్ (టి)

వైద్యులను నియమించాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. ఆసుపత్రిలో పలురకాల వైద్యనిపుణులు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉంటున్నారు. దీంతో సకాలంలో రోగులకు వైద్యం అందడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి గైనకాలజిస్టుతో పాటు ఇతర వైద్యులను వెంటనే నియమించాలి.

\- మహేష్, సిర్పూర్ (టి)

యువత క్రీడల్లో రాణించాలి


దుస్తులు అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామంలో కోనేరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన పరిశీలించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ టీషర్టులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకుల్లో క్రీడానైపుణ్యాలు ఉన్నాయని, వాటిని వెలికి తీసేందుకు క్రీడాపోటీలు నిర్వహించాలన్నారు. యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ సేవలో ముందుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగౌడ్, బాలాజీ, నిర్వాహకులు వినోద్, సునీల్, ప్రవీణ్, అజయ్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ


రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం దారుల్ అన్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రంజాన్ రేషన్ కిట్లను పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దారుల్ అన్సార్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ముఖఖం అహ్మద్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాదిరిగా పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు రేషన్ కిట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో 150 మంది మహిళలకు కిట్లు అందజేసినట్లు తెలిపారు. బియ్యం, చెక్కర, నూనె, పసుపు వంటి నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హాఫిజ్ రియాజ్, రహీం మలిస్‌స్, అబ్దుల్ షాకీర్, అబ్దుల్ ముఖీమ్, పర్వాస్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే పెద్ద పంచాయతీ!


ఎలుకపల్లి ఎస్సీ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పారుతున్న మురుగు నీరు

- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- లోపిస్తున్న పారిశుధ్యం
- సమస్యల్లో బెజ్జూర్ జీపీ

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీరంతా రోడ్లపైనే పారుతోంది. మురికి నీరంతా గుంతల్లో చేరడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేతిపంపుల వద్ద నీరు రోడ్ల పక్కన చేరడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. అధికారిక సమావేశాల్లో ఉన్నతాధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెబుతున్నప్పటికీ కిందిస్థాయి సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్నాయి. బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు వీటి పరిధిలోని ఎలుకపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో పారిశుధ్యం దారుణంగా తయారైంది. డ్రెయినేజీల నిర్మాణం లేకపోవడంతో మురికి నీరంతా రోడ్లకు ఇరువైపులా పారుతోంది. దీంతో గ్రామాల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

ఈగలు, దోమలతో సహవాసం..

పల్లె ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం లేకపోలేదు. ఆయా గ్రామాల్లో మురికి కాల్వలు లేకపోగా, ఉన్న వాటిలో పూడిక తీయడం, చెత్తాచెదారాన్ని తొలగించడంలో విఫలమవుతున్నారు. గ్రామాల్లో ఫాగింగ్, దోమల మందు స్ప్రే, మురికి కాల్వల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామీణ ప్రాంత ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహనకే పరిమితం..

పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించడానికే పరిమితమయ్యారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మాత్రం విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మురికి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తీసివేయించి మురుగు నీరు ఎక్కడ నిల్వ లేకుండా చూడాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని పల్లె ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీవో రమేశ్ రెడ్డితో పాటు బెజ్జూర్ పంచాయతీ కార్యదర్శి తుకారాంను 'సాక్షి' సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

నేటి నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని, కోలిండియాలో విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో జిల్లా వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. నేడు ప్రధాన మంత్రి హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీకి 4శాతం డీజిల్ ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులకు ఇచ్చే సబ్సిడీని నేరుగా ఆర్టీసీ సంస్థకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్‌లు, గిరిజన యూనివర్సిటీతోపాటు ఇతర హామీలు నెరవేర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన పనులను ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని రాకను నిరసిస్తూ సింగరేణి, ఆర్టీసీ ఇతర సంస్థల్లోని కార్మికులు జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ప్రతీరోజు వ్యాయామం చేయాలి

శ్రీరాంపూర్: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిరోజు వ్యాయామం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్కే 8 డిస్పెన్సరీలో అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. వైద్యులు వేదవ్యాస్, స్వప్న పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు


ఆరెగూడలో రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు (ఫైల్)


భట్‌పల్లి జీడిచేనులోని అంతర్గత రోడ్డు (ఫైల్)

- అవస్థల్లో గ్రామీణులు
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఆరెగూడ, భట్‌పల్లి, జీడిచేను, రాస్పెల్లి, అందవెల్లి, ఆరెగూడ, చింతగూడ, కోయవాగు గ్రామాల్లో గల అంతర్గత రహదారులు గుంతలతో నిండి ఉండడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

చిన్న వర్షానికే చిత్తడి..

కాలం ఏదైనా గ్రామాల్లోని రోడ్లు చిన్న వర్షానికే చిత్తడవుతున్నాయి. రోడ్లన్నీ బురదమయంగా మారడంతో కాలినడక కూడా సాధ్యం కావడం లేదు. గుంతల్లో మురికి నీరు చేరడంతో మోకాలి లోతు నీటిలో ప్రయాణించాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండాకాలంలో దుమ్ము, వర్షాకాలంలో బురదతో సహవాసం చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

కొరవడిన మురికి కాలువల నిర్వహణ

ఆరెగూడ, రాస్పెల్లి, అందవెల్లి గ్రామపంచాయతీల్లో మురికి కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో మురికినీరంతా రోడ్లపైకి వచ్చి చేరుతోంది. దీంతో దుర్వాసనతో పాటు రోడ్లన్నీ మురుగునీటితో బురదమయంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల మురికి కాలువలు ఉన్నప్పటికీ సక్రమంగా నిర్వహించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో మురికి కాలువలు అవసరమున్నా పాలకులు, అధికారులు మురికి కాలువలు నిర్మించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను నిర్మించాలని, మురికి కాలువల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నోసార్లు విన్నవించాం



మా ఊరిలో సీసీరోడ్లు వేయాలని అధికారులు, పాలకులకు ఎన్నోసార్లు విన్నవించాం. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. రోడ్లన్నీ ఎండా కాలం దుమ్ము, వర్షాకాలం బురదతో నిండిపోతున్నాయి. గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

\- రోహిని సంతోశ్, ఆరెగూడ

సీసీరోడ్డు నిర్మించాలి



కాలం ఏదైనా చిన్న వర్షానికి మా ఊరిలో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో బయట అడుగు పెట్టలేకపోతున్నాం. మా ఊరిలో కూడా సీసీరోడ్లు నిర్మించి సమస్యలు పరిష్కరించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు వేయాలి.

\- బోయిరె బాలాజీ, ఆరెగూడ

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: దసరా
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: బలగం

\- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

\-ఆసిఫాబాద్‌అర్బన్

రెండో విడత పంపిణీపై ఆశలు

- గొర్రెల పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- జిల్లాలో 1502 మంది లబ్ధిదారులు


గొర్రెల మంద

ఆసిఫాబాద్‌రూరల్: రెండో విడత గొర్రెల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరేళ్ల తర్వాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో లబ్ధిదారుల నుంచి 25శాతం వాటాను సేకరించే పనిలో వారు నిమగ్నమయ్యారు. జూన్, 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 4405 మంది గొల్లకురుమలు ఉండగా మొదటి విడతలో డ్రా పద్ధతిలో 2903 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగితా 1502 మందికి రెండోవిడతలో గొర్రెలు పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో అప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఐదు నెలల క్రితం జీవాలకు బదులుగా నగదును ఖాతాల్లో వేసి కొనుగోలు చేయించేలా ప్రభుత్వం నిర్ణయించింది. కాని అది సఫలం కాకపోవడంతో గొర్రెల పంపిణీ కార్యక్రమం మళ్లీ వాయిదా పడింది. కాగా గతంతో పోలిస్తే యూనిట్ ధర పెరగడంతో ఒక్కో లబ్ధిదారుడిపై రూ.12,000 అదనపు భారం పడనుంది.

వాటా సేకరణ..

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఇటీవల సీఎం కేసీఆర్ ఆదేశించడంతో ప్రక్రియ మొదలైంది. మొదటి విడత సమయంలో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు కాగా లబ్ధిదారుడి వాటా రూ.32,250లు, మిగతా సొమ్మును ప్రభుత్వం భరించేది. ప్రస్తుతం పెరిగిన యూనిట్ ధర రూ.1.75లక్షలు కాగా లబ్ధిదారుడి వాటా రూ. 43,750లు ఉంది. రెండో విడతలో భాగంగా 304 మంది లబ్ధిదారులు తమ వాటా రూ.1.33 కోట్లు ఖాతాల్లో జమ చేసి ఎదురు చూస్తున్నారు.

చిగురిస్తున్న ఆశలు

ఈ నెలలోనే గొర్రెలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దాదాపు అయిదేళ్ల క్రితం యూనిట్లు మంజూరు కావడంతో ప్రస్తుతం లబ్ధిదారులు ఎందరున్నారు..?, ఎక్కడున్నారు..?, మృతిచెందిన వారి నామినీ వివరాలు వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుందని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జీవాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారదర్శకత కోసం ఈసారి జీపీఎస్ సౌకర్యమున్న వాహనాల్లోనే వీటిని రవాణా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఇంకా టెండర్లు పిలవాల్సి ఉంది.

పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది

రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. లబ్ధిదారుల వివరాలను మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే గొర్రెలు పంపిణీ చేస్తాం.

\- సురేష్,
జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఘనంగా రాజరాజేశ్వరస్వామి కల్యాణం

కోటపల్లి: మండలంలోని జనగామ పంచాయతీ పరిధిలోని శివరాంపల్లి సమీపంలో వెలిసిన శ్రీ రాజరాజేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రోచ్చరణ మధ్య కల్యాణ తంతు జరిపించారు. జనగామ, శివరాంపల్లి, సుపాక, వెంచపల్లి, ఆలుగామతోపాటు వేమనపల్లి, చెన్నూర్ మండలాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం వారికి అన్నదానం చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెన్నెల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల ఐకేపీ వీవోఏల సంఘం సభ్యులు నెన్నెలలో ఎంపీపీ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. సమ్మె ప్రారంభించి ఐదు రోజులవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

నేడు నిరసనలు

మందమర్రిరూరల్: సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఏరియాలోని ఏటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

సీసీరోడ్లు ప్రారంభం

లక్సెట్టిపేట: పట్టణంలోని పలు వార్డుల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు నిర్మిస్తోందన్నారు.

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి: మండలంలోని నాయికపుగూడకు చెందిన మల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్ శుక్రవారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.